## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



కొండమల్లేపల్లి : చిన్నఅడిశర్లపల్లిలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎమ్మెల్యే బాలూనాయక్

కొండమల్లేపల్లి/డిండి, మే 13 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం కొండమల్లేపల్లి మండలంలోని చిన్నఅడిశర్లపల్లి సమీపంలో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, డిండి మండలం కామేపల్లి, చెర్కుపల్లిలో ఏర్పాటు చేసిన ఐకేపీ కేంద్రాన్ని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యాన్ని కాంటా వేసిన వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. కేంద్రాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. గోనె సంచుల కొరత లేకుండ చూడాల్సిన బాధ్యత నిర్వాహకులదే అన్నారు. లారీల కొరత కారణంగా ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమవుతున్నట్లు రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లడంతో లారీలను ఎప్పటికప్పుడు పంపించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు కూడా ధాన్యాన్ని శుభ్రం చేసి తీసుకు రావాలని సూచించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, పౌరసరఫరాల జిల్లా మేనేజర హరీశ్, డీసీఓ పత్యానాయక్, దేవరకొండ ఆర్డీఓ రమాణారెడ్డి, తాసీల్దార్ నరేందర్, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణూధర్ రెడ్డి, డీటీఎస్ఓ హన్మంతు శ్రీనివాస్‌గౌడ్, సీఈఓ పల్లా తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

### మిల్లర్లతో సమావేశం

చందంపేట(దేవరకొండ) : కొనుగోలు కేంద్రాల నుంచి తీసుకొచ్చిన ధాన్యం లారీల నుంచి ధాన్యం బస్తాల అన్‌లోడింగ్‌ను రైస్ మిల్లర్లు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే బాలూనాయక్‌తో కలిసి మంగళవారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పదిహేను రోజులలో ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని, ప్రతి మిల్లరు రోజు కనీసం 15 లారీలైన దిగుమతి చేసుకోవాలని ఆదేశించారు..

## సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

- కేవీకే శాస్త్రవేత్తలు



నిడమనూరు :వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

హాలియా/నిడమనూరు, మే 13 : రైతులు పంటలు సాగు చేసే సమయంలో యూరియా వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్ర కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, కంపసాగర్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్.లింగయ్య, డాక్టర్ వి.శ్రీధర్ అన్నారు. హాలియా మండలం పాలెం గ్రామంలో, నిడమనూరు మండలంలోని తుమ్మడం గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వారు పాల్గొని వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పంట మార్పిడి పద్ధతుల ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ అధికారి టి.రాంబాబు మాట్లాడుతూ విత్తనాల లభ్యత, పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలోమండల వ్యవసాయ అధికారి సరిత, పంచాయతీ కార్యదర్శి జి. లింగయ్య, వ్యవసాయ విస్తరణాధికారి ఎం.అనిల్‌నాయక్, మాజీ ఎంపీటీసీ పెదమాం యాదయ్య, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## మొల్కచర్లలో క్షుద్రపూజల కలకలం

అడవిదేవులపల్లి, మే 13: అడవిదేవులపల్లి మండలం మొల్కచర్ల గ్రామంలోని మైసమ్మ గుడి ముందు కొందరు క్షుద్ర పూజలు చేశారనే వార్త గ్రామంలో కలకలం రేపింది. సోమవారం రాత్రి కొంత మంది గుడి ముందు ముగ్గు వేసి దున్నపోతును బలిచ్చి నిప్పు పెట్టి కాల్చారు. ముగ్గుకు ఏడు దిక్కుల్లో ఇనుప మేకులు కొట్టి, పసుపు, కుంకుమ వేసి కుండలు పగులగొట్టారు. మంగళవారం ఉదయం గుడి ముందు క్షుద్ర పూజల ఆనవాళ్లు కనిపించడంతో గ్రామస్తులు భయాందోళకు గురై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు మూఢనమ్మకాలను నమ్మవద్దని సూచించారు.

## 'రాజీవ్ యువ వికాసం పథకంలో సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలి'



నిడమనూరు : ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నార్కట్‌పల్లి, మే 13 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకంలో సిబిల్ స్కోర్ నిబంధనను ఎత్తివేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లె పరమేశ్, బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి బాషపాక రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పట్టణ కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సామాన్యులకు అందకుండా కొర్రీలు పెడుతున్నదని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లను కూడా పేదలకు కాకుండా ఆ పార్టీ కార్యకర్తలకే అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం పేదలకు లబ్ధిచేకూరేలా పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

### ఎంపీడీఓకు వినతి

నిడమనూరు : రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్‌ను పరిగణలోకి తీసుకునే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీఓ బోనగిరి రమేశ్‌కు వినతి పత్రం అందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పార్టీ మండలాధ్యక్షుడు జిల్లా రమేశ్ నాయకులు సీహెచ్. ప్రసాద్, దుబాస్ వెంకటేశ్వర్లు, పి.శంకర్‌బాబు ఉన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న కాటం వెంకటేశం

చిట్యాల, మే 13 : మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన నల్లవెల్లి నరసింహ, బర్రె చంద్రకళ, ఆనగంటి సాయిలుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంగళవారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం గ్రామంలో అందించారు. కార్యక్రమంలో నాయకులు ఏర్పుల నరసింహ, తెలుసూరి సైదులు, నల్లవెల్లి బుగ్గయ్య, ఏర్పుల వెంకన్న, యాదయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

**పేరు మార్పు**

ఎడ్ల మైసయ్య S/o. ముత్తయ్య నా కుతురైన ఎడ్ల మౌనిక 10 సంవత్సరాలు అర్హత ఐదవ తరగతి విద్యార్థి, R/o.H.No.4-77/40, గ్రా॥ధర్మారెడ్డి పల్లి, మండలం భూదాన్‌పోచంపల్లి, జిల్లా యాదాద్రి భువనగిరి నా కూతురు పేరును ఎడ్ల అక్షర గా మార్చడమైనదని గమనించగలరు.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ: 9182777625, 9182777635 | దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059 | సూర్యాపేట: 9182777630 | భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059 | కోదాడ: 9182777630 | చౌటుప్పల్: 9182777638

## శిశువుల సంరక్షణ కోసమే 'ఊయల'

- ఐసీడీఎస్ సీడీపీఓలు మమత,అస్రా అంజుమ్



నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఊయలను ప్రారంభిస్తున్న సీడీపీఓ, వైద్యులు

మిర్యాలగూడ/నకిరేకల్, మే 13: శిశువుల సంరక్షణే ధ్యేయంగా 'ఊయల'ను ఏర్పాటు చేశామని, తల్లిదండ్రులు అప్పుడే పుట్టిన పిల్లలను భారంగా భావిస్తే ఊయలలో వదిలి వెళ్లొచ్చని ఐసీడీఎస్ సీడీపీఓలు రేకల మమత, అస్రా అంజుమ్ అన్నారు. శిశు మరణాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఊయల కార్యక్రమం దోహదపడుతుందన్నారు. మంగళవారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలోని ప్రసూతి వైద్యశాలలో, నకిరేకల్ ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఊయలను, శిశువుల స్వీకరణ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తల్లిదండ్రులు ఏటకారణాలతో శిశువులను వద్దనుకొని చెత్తకుప్పల్లో, కాల్వల్లో పడేస్తూ వారి మరణానికి కారణమవుతున్నారని, దానిని నివారించేందుకే ఊయలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ శిశువులను అప్పగించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఎవరికైనా పిల్లలు దత్తత కావాలనుకొని వస్తే చట్టపరంగా వారికి దత్తత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి వైద్యులు, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ చైర్మన్ చింత కృష్ణయ్య, లీగల్ అడ్వయిజర్ వెంకన్న, సోషల్ వర్కర్ రమణి, శిశు గృహ మేనేజర్ దుర్గా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లీలాకుమారి, నాగమణి, నజీమాబేగం, పద్మ, అంగన్‌వాడీ టీచర్లు, నకిరేకల్‌లో ఆస్పత్రి సూపరింటెండెంట్ శోభారాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ ఉమ, సంరక్షణ కేంద్రం అధికారి తేజస్విని, బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ ఎన్. రేవతి, సూపర్ వైజర్లు జి సునీత, ఎన్.భవాని, ఎం.జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధికార ప్రతినిధిగా నర్సింహ



కొత్త నర్సింహ

నార్కట్‌పల్లి, మే 13 : యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధికార ప్రతినిధిగా నార్కట్‌పల్లి మండలం చిన్ననారాయణపురం గ్రామానికి చెందిన కొత్త నర్సింహను నియమించినట్లు వేదిక జిల్లా అధ్యక్షుడు బెల్లి నాగరాజుయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## నేటి నుంచి డిగ్రీ పరీక్షలు

రామగిరి, మే 13: ఎంజీయూ పరిధిలో డిగ్రీ పరీక్షలు ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సెమిస్టర్ 2,4,6లో 23,239 మంది విద్యార్థులు రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరవుతున్నారు. దాంతో పాటు బ్యాక్‌లాగ్ పరీక్షలు 1, 3, 5 సెమిస్టర్‌లలో 15,292మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు ఎంజీయూ సీఓఈ డాక్టర్ జి.ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు. పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని, అన్ని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటిండెంట్లను ఆదేశించారు.

## బైక్‌ను ట్రాక్టర్ ఢీకొని.. ఇరువురికి తీవ్రగాయాలు

నిడమనూరు, మే 13 : మండలంలోని పార్వతీపురం వద్ద మంగళవారం బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తుమ్మడం గ్రామానికి చెందిన బుట్టి మహేశ్(38) సుతారి మేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన భార్య ఆమనితో కలిసి నిడమనూరులో సుతారి పనికి వెళ్లిన ఆయన పనులు ముగించుకొని మధ్యాహ్నం బైక్‌పై తుమ్మడం గ్రామానికి బయల్దేరాడు. పార్వతీపురం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టింది. దాంతో మహేశ్, ఆమనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని మిర్యాలగూడలోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ కోడిరెక్క జోజి తెలిపారు.

## లారీ డ్రైవర్ అదృశ్యం

చిట్యాల, మే 13 : మహారాష్ట్రకు చెందిన వ్యక్తి చిట్యాలలో అదృశ్యమైనట్లు ఎస్‌ఐ ఎన్. ధర్మ తెలిపారు. మహారాష్ట్రలోని షోలాపూర్ మండలం కుంభారి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ అష్ఫాక్ హాజీమలాంగ్ జమెదార్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. షోలాపూర్ నుంచి శ్రీకాకుళానికి లారీతో బయల్దేరాడు. ఈ నెల 5న చిట్యాల శివారులోని న్యూ పంజాబ్ ఫౌజీ దాబా వద్ద లారీ ఆపి ఎటో వెళ్లిపోయాడు. అతడి సోదరుడు ఇర్ఫాన్ ఫోన్ చేసినా ఫోన్ స్విచ్‌ఆఫ్‌గా వచ్చింది. దాంతో అతను లారీ జీపీఎస్ ఆధారంగా చిట్యాలకు వచ్చి పరిసరాల్లో వెతికినా హాజీ మలాంగ్ ఆచూకీ లభించలేదు. దాంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇర్ఫాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

## ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు షురూ

రామగిరి, మే 13: విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు అందించే వేసవి శిక్షణ తరగతులు మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రారంభమయ్యాయి. నల్లగొండ డైట్‌లో ప్రిన్సిపాల్ నర్సింహ, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి ఆర్.రామచంద్రయ్య శిక్షణను ప్రారంభించారు. తొలి విడుతలో ఈ నెల 14 నుంచి 17 వరకు హైస్కూల్స్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌కు చెందిన గణితం, ఇంగ్లిష్, తెలుగు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్న రిసోర్స్‌పర్సన్లకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతులు మూడు విడుతల్లో ఈ నెల 31వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

## ఆర్థిక సాయం

శాలిగౌరారం, మే 13 : మండలంలోని ఆకారం గ్రామానికి చెందిన కరీం అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్ మంగళవారం కరీం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రకళాదశరథ, బుడిగె శ్రీనివాస్ ఉన్నారు.

## విద్యుత్ అభివృద్ధి పనుల్లో మునుగోడును ఆదర్శంగా నిలుపాలి

- టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, మే13 : విద్యుత్ సమస్యల పరిష్కారంలో మునుగోడు నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌ను కోరారు. మంగళవారం హైదారాబాద్‌లోని టీజీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సీఎండీ ముషారఫ్‌తో కలిసి నియోజకవర్గం విద్యుత్ సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో నెలకొన్న ఓల్టేజీ సమస్య, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, అదనపు సబ్‌స్టేషన్ల ఏర్పాటు, వేలాడుతున్న విత్యుత్ లైన్ సమస్యలను సీఎండీతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఎండీ విద్యుత్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని, సరిగా పని చేయని, అవినీతికి పాల్పడుతున్న విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే సీఎండీకి వినతిపత్రం అందించారు.

## పేదలకు ఉచితంగా వైద్యం అందించడం అభినందనీయం

- ఎమ్మెల్యే వేముల వీరేశం

కేతేపల్లి, మే 13 : గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని ఇనుపాముల ఆవాస గ్రామమైన రాయపురంలో ఉషోదయ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఎన్.వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ బొజ్జ సుందర్, నాయకులు పాల్గొన్నారు.

## లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



కాపువారిగూడెంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న లైన్‌మెన్ మోతీలాల్, గ్రామస్తులు

త్రిపురారం, మే 13: మండలంలోని కాపువారిగూడెం గ్రామంలో విద్యుత్ లోఓల్టేజీ సమస్య తలెత్తడంతో మంగళవారం 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ ఎ.బాలూనాయక్ తెలిపారు. గ్రామ ప్రజలు విద్యుత్ లోఓల్టేజీ సమస్య వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకొని కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలో విద్యుత్ కనెక్షన్ ఉన్న వారందరూ విద్యుత్ మీటర్లు తీసుకోవాలని, 200 యూనిట్లు పైబడిన వారికే కరెంట్ బిల్లు వస్తున్నందున విద్యుత్ చౌర్యానికి పాల్పడవద్దని సూచించారు. కార్యక్రమంలో లైన్‌మెన్ ధనావత్ మోతీలాల్‌నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతులు అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ రూరల్, మే 13 : రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్ వద్ద తెలంగాణ విత్తన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విత్తన విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు రైతులు కల్తీ విత్తనాలు కొని మోసపోకుండా తెలంగాణ విత్తన సంస్థ ద్వారా విత్తనాలను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన నేపథ్యంలో రానున్న రోజుల్లో సన్న రకం వడ్లు ఎక్కువగా అవసరం అవుతాయన్నారు. పత్తి విత్తనాలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు ఉంటే సెల్ : 8977751452 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డీసీఓ సత్యానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేశ్, ఏఓ శ్రీనివాస్, టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు మురళి పాల్గొన్నారు.

### భవిత కేంద్రం తనిఖీ


గుర్రంపోడ్ : మండలకేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు శిక్షణ ఇచ్చే భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రంలోని వసతులు, ఫిజియోథెరపీ పరికరాలను పరిశీలించారు. కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట అడిషన్ కలెక్టర్ అమిత్ నారాయణ్, తాసీల్దార్ పి.శ్రీనివాస్, ఎంపీడీఓ మంజుల, ఎంఈఓ యాదగిరి ఉన్నారు.

## ఫొటో గ్రాఫర్‌కు ఆర్థిక సాయం

రామగిరి, మే 13: నల్లగొండ పట్టణ ఫొటోగ్రాఫర్ దాసరి ప్రశాంత్ కిడ్నీ వ్యాధితో బాధపడుతుండడంతో మంగళవారం తెలంగాణ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కుటుంబ భరోసా పథకం కింద రూ. 10వేల చెక్కును సంఘం నాయకులు అందించారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు కంభంపాటి రవి, ప్రధాన కార్యదరిశ దాశపత్రి జనార్దన్, కోశాధికారి భీమిడి మాధవరెడ్డి, కుటుంబ భరోసా ఇన్‌చార్జి బొల్గూరి నాగరాజు పాల్గొన్నారు.

## తీగలకు అడ్డొస్తున్నాయని.. నరికేశారు

- జాతీయ రహదారి వెంట విద్యుత్ సిబ్బంది నిర్వాకం



అంగడిపేట స్టేజీ వద్ద కోదాడ -జడ్చర్ల రహదారికి ఇరువైపులా విద్యుత్ సిబ్బంది నరికేసిన హరితహారం మొక్కలు

పెద్దఅడిశర్లపల్లి, మే 13 : విద్యుత్ తీగలను తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించాల్సిన విద్యుత్ సిబ్బంది ఏకంగా హరితహారం చెట్లనే మొదలు కాడికి నరికేసుస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హరిత హారంలో కార్యక్రమంలో భాగంగా ఐదేండ్ల క్రిందట పీఏపల్లి మండలం గుండా వెళ్లే కోదాడ-జడ్చర్ల హైవేకు ఇరువైపులా మొక్కలను నాటింది. వాటిని సంరక్షించే బాధ్యతను స్థానిక గ్రామ పంచాయతీలకు అప్పగించింది. దాంతో స్థానిక అధికారులు, సిబ్బంది ఐదేండ్లుగా ప్రతిరోజూ మొక్కలకు నీరు పెట్టడంతో పాటు వాటిని పశువులు మేయకుండా సంరక్షించారు. ప్రస్తుతం హరితహారం మొక్కలు పెరిగి చెట్లుగా మారి పచ్చదనాన్ని పంచుతున్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ తీగలకు చెట్లు తాకుతున్నాయంటూ వారం రోజులుగా కొండమల్లేపల్లి నుంచి పెద్దవూర వరకు కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను నరికేస్తున్నారు. విద్యుత్ తీగలకు తాకుతున్న కొమ్మలను మాత్రమే నరకాల్సి ఉండగా కొన్ని చోట్ల ఏకంగా చెట్లనే నరికివేస్తున్నారు. ప్రభుత్వం, స్థానిక పంచాయతీ యంత్రాంగం ఎంతో కష్టపడి పెంచిన చెట్లను మొత్తంగా నరకడం ఏంటని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డబ్బికార్ మల్లేశ్

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

మిర్యాలగూడ, మే 13 : ఈ నెల 20న చేపట్టనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్ అన్నారు. మంగళవారం వేర్ హౌస్ కార్మికులతో కలిసి సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో తిరుపతి రామ్మూర్తి, మల్లు గౌతంరెడ్డి, బీఎం. నాయుడు, అంజల్‌రావు, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, రామ్‌నాయక్, అంజయ్య, కృష్ణ, వజ్రం పాల్గొన్నారు.

### లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

చండూరు : కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల స్థానంలో తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు జెర్రిపోతుల ధనుంజయ డిమాండ్ చేశారు. ఈ నెల 20న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు చిట్టిమల్ల లింగయ్య, రైతుసంఘం నాయకులు బల్లెం స్వామి, ఈరటి వెంకటయ్య, హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సాయం కృష్ణయ్య, శేఖర్, నాగేశ్, నాగరాజు, చిరంజీవి, ఆకాశ్, లింగస్వామి పాల్గొన్నారు.

## విద్యా సంస్థల వాహనాలకు ఫిట్‌నెస్ ఉండాలి

- డీటీసీ వాణి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీ వాణి

నల్లగొండ సిటీ, మే 13 : విద్యాసంస్థల బస్సులు ఫిట్‌నెస్ కలిగి ఉండాలని డీటీసీ వాణి అన్నారు. మంగవారం ఆర్టీఓ కార్యాలయంలో స్కూల్ బస్సుల యజమానులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మోటరు వాహనాల చట్టం ప్రకారం ఈ నెల 15 నాటికి విద్యాసంస్థల వాహనాల ఫిట్‌నెస్ ముగిసినందున, ఆయా విద్యాసంస్థలు తమ వాహనాలకు అవసరమైన మరమ్మతులు చేయించుకుని ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందకుండా వాహనాలను నడిపితే ఆయా విద్యాసంస్థ గుర్తింపును సైతం ప్రభుత్వం రద్దు చేస్తుందన్నారు. కళాశాల, పాఠశాల పేరుతో పాటు ఫోన్ నంబర్, పూర్తి చిరునామాను బస్సు ఎడమ వైపుతో పాటు ముందు భాగంలో రాయించాలని సూచించారు. 60 సంవత్సరాలు పైబడిన వారిని బస్సు డ్రైవర్లుగా నియమించవద్దన్నారు. నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంవీఐలు లావణ్య, మల్లికార్జున, చంద్రశేఖర్, సతీశ్, సోనిప్రియా, ఉషశ్రీ, చిరంజీవి, రాంబాబు పాల్గొన్నారు.

## యువకుడిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఎస్‌ఐని సస్పెండ్ చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి



యువకుడిని పరామర్శిస్తున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ సిటీ/రామగిరి, మే 13 : ప్రేమికులను విడదీయడంతో పాటు యువకుడిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలకు గురి చేసిన కనగల్ ఎస్‌ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కనగల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పానగల్లుకు చెందిన కుంచం నవీన్, అదే గ్రామానికి చెందిన యువతి ప్రేమించుకున్నారని, వారు మేజర్లు అయినందున చట్ట ప్రకారం వివాహం చేసుకునే హక్కు వారికి ఉందన్నారు. ఈ విషయంలో పోలీసులు జోక్యం చేసుకొని నవీన్ యువతిని కిడ్నాప్ చేశాడని పేర్కొంటూ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచక్షణా రహితంగా కొట్టారని పేర్కొన్నారు. నవీన్‌పై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం వల్లే అతను ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి కనగల్ ఎస్‌ఐతో పాటు ఇద్దరూ కానిస్టేబుళ్లను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని ఆయన పరామర్శించారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండెంపల్లి సత్తయ్య, హాలియా, కనగల్ మండలాల కార్యదర్శులు సైదులు, కానుగు లింగస్వామి, ఎస్కే సుల్తానా, వెంకట్ రాములు, శివ ఉన్నారు.

## సీబీఎస్‌సీ ఫలితాల్లో విపస్య విద్యార్థుల ప్రతిభ



బండారు తనుశ్



శ్రీచందన

రామగిరి, మే 13: నల్లగొండలోని చర్లపల్లిలో గల విపస్య పాఠశాల విద్యార్థులు మంగళవారం విడుదలైన సీబీఎస్‌సీ 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి సత్తా చాటినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ తెలిపారు. 60 శాతం విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన బండారు తనుశ్ 563, పిన్నపురెడ్డి శ్రీచందన 550, కందగట్ల సాయి చరణ్ 537 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను పాఠశాల చైర్మన్ బండారు ప్రసాద్ అభినందించారు.

## సీబీఎస్‌సీ ఫలితాల్లో కేంద్రీయ విద్యాలయం విద్యార్థుల ప్రతిభ

రామగిరి, మే 13: సీబీఎస్‌సీ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో నల్లగొండలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి.శ్రీవాసులు తెలిపారు. పదిలో ఎన్.మౌనిక 462, పి. సద్గుణ 457 మార్కులు సాధించారని, విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించి 100 శాతం ఫలితాలు తెచ్చారన్నారు. ఇంటర్‌లో బి. హిందూశ్రీ 406, ఆర్.సాయి చరణ్ 399 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. బుధవారం నుంచి ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్లు ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. ఈ నెల 23 వరకు దరఖాస్తులకు అవకాశం ఉందని పేర్కొన్నారు.



మేడే ఉత్సవాల్లో పాల్గొన్న విద్యుత్ కార్మిక సంఘం నాయకులు

## ఘనంగా మేడే ఉత్సవాలు

నల్లగొండ సిటీ, మే 13 : కార్మిక దినోత్సవం వేడుకలను మంగళవారం జిల్లా కేంద్రంలో విద్యుత్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ నాయకుడు వెంకటయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో లేబర్ కోడ్‌లను తేవడం సరికాదన్నారు. కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు శివప్రసాద్, సాయిబాబు, వేణు, జనార్దన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.